


## ఆధునిక దేవుని ప్రజలు, శాస్త్రమెరుగని క్రీస్తు మొదటి రాకడ !?

సర్వోన్నతుడు, సర్వశక్తిమంతుడు, సకలాశీర్వాదాలకు కారణభూతుడైన దేవాధి దేవునికి, సర్వేశ్వరుడుగా, పరమేశ్వరుడుగా, పరమాత్ముడుగా కూడా సర్వలోక ప్రజల చేత నిత్యము పూజింపబడుతున్న మహాదేవుడైన మన పరమతండ్రికి ఆయన ప్రియకుమారుడు, మనుషులందరికి ప్రభువును రక్షకుడైన క్రీస్తుయేసు ద్వారా పరిశుద్ధాత్మని సహాయ సహవాసములతో వేవేల కృతజ్ఞతా స్తుతులు స్తోత్రాలు సమర్పిస్తున్నాను. ప్రజలందరి పాపవిమోచన కొరకు కల్వరి సిలువలో ప్రాణం పెట్టిన క్రీస్తు రక్తంలో కడుగబడిన క్రైస్తవ సోదర సోదరీ మణులందరికీ, క్రీస్తు దేవుని కుమారుడని నమ్మకపోయినా దేవుని బహుమానంగా ఈ లోకంలో పుట్టిన క్రైస్తవేతరులైన సోదర, సోదరీ మణులందరికీ ప్రభువైన క్రీస్తు నామంలో నా వందనాలు, శుభములు పలికి వ్రాయునది.

నేటి ఆధునిక యుగంలోని ప్రపంచ దేశాలలో అత్యధిక ప్రజలు అమితానందంతో సకుటుంబ సపరివారంతో అద్భుతంగా జరుపుకొనే గొప్ప పండుగ క్రిస్మస్. క్రిస్మస్ పండుగను ఎందుకు జరుపుతున్నారు అని క్రైస్తవ పండిత పామరులతోపాటు, క్రైస్తవేతరులలో కూడా ఎవ్వరిని అడిగినా ప్రభువైన యేసుక్రీస్తు పుట్టిన దినం

అని టక్కున సమాధానం చెబుతారు. అయితే పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌లోగాని, చరిత్రలోగాని ఖచ్చితమైన ఆధారాలు (తేది, నెల, సంవత్సరం) లేకుండా జరుపుకొంటున్న మహోత్సవమిది అంటే ఆశ్చర్యపోక తప్పదు. క్రైస్తవులంతా క్రీస్తు మరియు పరిశుద్ధాత్మని బోధలో కారణం లేదా ఆధారం లేకుండా ఘనంగా పండుగలు చేయవద్దన్న సంగతినే మర్చిపోయారు (గలతీ 5:8-11; కొలొస్సి 1 : 16 -19) ప్రాశ్చాత్య దేశాలలోనైతే ప్రజలంతా ఒక నెలకన్నా ఎక్కువరోజులు ఈ పండుగ జరుపుతారు. మన దేశంలో కూడా యూత్ క్రిస్మస్, టౌను క్రిస్మస్, ఐక్య క్రిస్మస్, లేడీస్ క్రిస్మస్ ఇలా అనేక పేర్లతో దాదాపు నెలకుపైననే సంబరాలు చేస్తున్నారు. “ఒకని జన్మదినం కన్నా, మరణదినమే మేలు” (ప్రసంగి 7:1) అనే దేవుని వాక్కును మరచి మనుష్యులు కల్పించిన మతాచారాలను పాటించి దేవుని యొద్దకు చేరే ఏకైక మార్గమైన క్రైస్తవ్యాన్ని మామూలు మతంగా మార్చిన ఘనులే నాటి- నేటి పండుగ క్రైస్తవులు అని దేవుని ఆత్మతో ఆలోచిస్తేనే అర్థం అయితీరుతుంది. (మార్కు 7:6-9).

దేవుని వాక్యమైన బైబిల్ గ్రంథాన్ని పరిశుద్ధాత్మ సహాయంతో ఆలోచించి క్రీస్తుశిష్యులైన అపోస్తలులు చెప్పినట్లు (1 పేతురు 1:8-11) కాలానుగుణంగా ఈ దేవోక్తులను చదివి ఆలోచించి పరిశీలించినట్లు అయితే (2తిమోతి 2:7, ఎఫెసీ 3:3-12, అపో.కా. 17:11) ఈ క్రిస్మస్ పండుగ యొక్క అర్థం, పవిత్రత, ప్రాధాన్యత ఎంతో గొప్పగా వుండేది. దేవుడు కావాలనే మరుగు చేసిన మర్మాన్ని మనిషి మట్టి బుర్రతో లెక్కగట్టి ఆయన జన్మదినాన్ని క్రీ॥ పూ॥ 4వ సం॥ అని చెప్పి ఆయనను ఈ లోకంలో ఎంతో చిన్నవాడుగాను, ఒక కొత్త మత స్థాపకుడుగా చూపించే ప్రయత్నం చేశారు. నేటి భారతంలోని కొందరు సోదరులు మీ క్రీస్తు నిన్నగాక మొన్న పుట్టిన బచ్చా అని ఆనాటి యూదులవలెనే (యోహాను 8:43-59) వాదిస్తున్నారు. అందుకే క్రీస్తు నిజమైన జన్మదినమెపుడో ప్రపంచానికి సత్యసాక్షిగా ప్రకటించాలని ఈ కరపత్రం వ్రాయుచున్నాను. మరియు క్రీస్తు రెండవ రాకడను గూర్చి దివారాత్రులు ఎదురుచూస్తూ సువార్తను ప్రకటిస్తున్న వారికి కూడా తెలయని ఆయన మొదటి రాకడను గూర్చి మీకు తెలియకుండుట నాకిష్టం లేదు గనుక క్రీస్తు ఈ లోకంలోనికి వచ్చాడా? ఈ లోకంలో పుట్టాడా? అని దేవుని వాక్యాధారంతో ముందుకు వెళుదాం (1 కొరింథీ 2:1-16) ఇది సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటిస్తున్న మహాజ్ఞానమని మరచి పోకండి. (1కొరింథీ 1:21-25) ప్రతివారి మోకాలు యేసు నామంలో దేవుని ముందు వంగునట్లు సర్వసత్యాన్ని ప్రకటించుచుదాం (ఫిలిప్పు 2:8-11) దేవుడిచ్చే నీతి కిరీటాన్ని బహుమానంగా

పొందుదాం రండి! ఆయన జన్మను గాక మరణాన్ని తప్పనిసరిగా ప్రచురించాలి (1కొరింథీ 11:23-32). అనే సత్యాన్ని గ్రహించి ఆయన రాజ్య సువార్తను ప్రకటించుడి.

లోక రక్షకుడైన క్రీస్తు ఈ లోకంలోని బెత్లెహేములో నరుడిగా పుట్టాడనే విషయాన్ని ఆనాటి యూదులు, వారి శాస్త్రులు, పరిసయ్యులకు, మతాధికారులకు చెప్పకుండా కేవలం ఆనాటి పామరులైన గొర్రెల కాపరులకు మాత్రమే దేవుడు తన దూత ద్వారా తెలియపర్చాడు. "దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు. దానికిదే మీకానవాలు, ఒక శిశువు పొత్తిగుడ్డలతో చుట్టబడి పశువుల తొట్టిలో పండుకొనియుండుట మీరు చూచెదరని వారితో చెప్పెను" (లూకా 2:8-20). గొర్రెలకాపరులకు చిన్నపిల్లవాడు లేదా శిశువు ఎలావస్తాడు అనేది అర్థంకాదు గనుక పుట్టాడు అని చెప్పాడు. అయితే ధర్మశాస్త్ర ప్రవీణులకు ఎలా వస్తాడో ముందుగానే తమప్రవక్తల ద్వారా చెప్పాడు గనుక వారికి గుర్తుండి తీరాలనే తెలియజేయలేదు. ఇప్పటికి 2000 సం॥లైనా పామరులైన గొల్లలకు చెప్పిందే ప్రతిసం॥ ఇంటింటికి తిరిగి క్రైస్తవులకు - క్రైస్తవేతరులకు ప్రకటిస్తున్నారు గాని, సర్వలోకానికి చెప్పమన్న సువార్తలో (యోహాను 1:1-14, 1 కొరింథీ 15:1-3, 1 తిమోతీ 1:15) క్రీస్తు పరలోకంలో పుట్టి భూలోకానికి దిగి వచ్చాడనే బోధ చెప్పడంలేదు అని ఆలోచించండి. ఆ తర్వాత అన్యులు, లోకజ్ఞానులైనవారు కూడా ఆకాశ నక్షత్రమును చూచి ఒక మహారాజు పుట్టాడని గ్రహించి వచ్చి, ఆయనను పూజించారు (మత్తయి 2:1-11) గొఱ్ఱెల కాపరులు మరియు దేవుని సైన్యమైన దేవదూతలు మాత్రము దేవునికి స్తోత్రములు చేసి తమ భక్తితో ఆయనను మహిమపరచారు (లూకా 2:18,19,20; 1 తిమోతి 3:16). ఇప్పటికి కేవలం తమ సంఘసభ్యుల ఇంటికి మాత్రమే వెళ్ళి అర్థరాత్రి మద్దెలదరువు లాగా అరిగిపోయిన రికార్డునే వేస్తూ ఇప్పుడు మీరెళ్ళి చూస్తే పశువుల తొట్టిలో పరుండ బెట్టియుండుట మీరు చూచెదరు అని చెబుతున్నాడు. ఇప్పుడు ఒకవేళ బెత్తెహేము వెళ్ళితే అక్కడ పశు వులపాక లేదు, బాలయేసు లేడు అనే సంగతిని గ్రహించని మూర్ఖత్వంలో ఉన్నారు అనేకులు.

ఆ రోజుల్లో, గొల్లలు, దేవుని దూతలు క్రీస్తును ఆరాధించారని భ్రమపడి, సాతానుతంత్రాన్ని బట్టే క్రైస్ట్ + మాస్ = క్రిస్టమస్ (క్రీస్తు ఆరాధన). క్రిస్మస్ అనే పదమును మనవారు వాడుకలోనికి తెచ్చి పుట్టినరోజు పండుగకు పునాది వేశారు. అయితే దేవుని ప్రజలైన ఆనాటి ఇశ్రాయేలీయులు తమ మెస్సియాకోసం ఎదురుచూస్తున్నా వారికి మాత్రం ఆయన మనుష్యునిగా అనగా తమసహోదరుల నుండే పుట్టాడని తెలియజేయలేదు దేవుడు ఇది ఆశ్చర్యం, అద్భుతం ఇప్పటికీ చాలామందికి అందని

మహాజ్ఞాన సంపద. అలాగే నేటి దేవుని ప్రజలు క్రీస్తు శిష్యులైన క్రైస్తవులకు కూడా క్రీస్తు, అపోస్తులుల ద్వారా కూడా ఎక్కడా చెప్పలేదు దేవుడు ఇది మరింత ఆశ్చర్యం. కాబట్టి దేవుడు ఇశ్రాయేలీయులకు వారి ప్రవక్తల ద్వారా ముందే చెప్పినది ఏమిటో ముందుగా ఆలోచించి, ఆ తర్వాత క్రీస్తు, అపోస్తులుల బోధను చూద్దాం. ఈ లోకానికి వాక్యానుసారమైన సువార్తను అనగా **క్రీస్తు మరణ-సమాధి-పునరుత్థానములను** గూర్చి మాత్రమే (1కొరింథీ 15:1-3) ప్రకటించమన్న అపోస్తులుల బోధను జ్ఞాపకము చేసుకొందాం. సువార్తలో జన్మనుగూర్చి, జన్మదినమును గూర్చి కాని ప్రకటించమనలేదు అని గ్రహించాలి నా తరంలోని సువార్తికులు, బోధకులు, రెవరెండ్లు, బిషప్పులు మరియు బైబిల్ కాలేజీలు, యూనివర్సిటీలు నడుపుతున్న వారందరికి క్రీస్తు ఇచ్చిన ఆజ్ఞను మాత్రమే గుర్తు చేస్తున్నాను తప్ప ఇది విమర్శగా తీసుకోకూడదని ప్రేమపూర్వకంగా మనవి చేస్తున్నాను.

"కన్యక గర్భవతియై కుమారుని కనును ఆయనకు ఇమ్మానుయేలు అనుపేరు పెట్టును" (యెషయా 7:14, క్రీ॥పూ॥700) "ఏలయనగా మనకు శిశువు పుట్టెను. మనకు కుమారుడు అనుగ్రహింపబడెను..." (యెషయా 9:6,7).

ఇక్కడ యెషయా ఆనాటి తన ప్రజలతో అప్పటికే దేవునికి కుమారుడు పుట్టెను అని చెప్పి ఆ తరువాత ఆకుమారుని మనకు అనుగ్రహించెను అని వ్రాశాడు. అందుకే కన్యక గర్భవతియై కుమారుని కనును అన్నాడే గాని కుమారుడు పుట్టును అనలేదు. వైద్యబాషలో, దేవుని వాక్యప్రకారంగా పుట్టడం వేరు, కనడం వేరు. కనడం అనగా డెలివరీ లేదా ప్రసవించుట అంటారు. మానవులు పుట్టేది పురుషుని నుండి మాత్రమే (మత్తయి 4:1-12, యెషయా 49:5,15) తల్లి గర్భంలో మనుషులందరి పుట్టుక లేదా జన్మదినం రహస్యమేనని బైబిల్లో దేవుడు క్రీ॥పూ॥ 1000 సం॥లో దావీదు ద్వారా లోకమంతటికి తెలియజేసాడు. (కీర్తన 139 : 13-16). ఇందును బట్టే దేవుడు క్రీస్తు జన్మదినము గూర్చి కూడా బైబిల్లో ఎక్కడా వ్రాయించలేదు. చరిత్రకారులకు ఎప్పటికీ దొరకనివ్వలేదు. ఎప్పటికి దొరకదు కూడా అన్యులైన లోకజ్ఞానులు మాత్రమే ఆయన ఉన్న ఇంటిలోనికి వచ్చి అనగా కొన్ని రోజుల తర్వాత ఆయనను పూజించారు. అయితే క్రీస్తు జన్మదినం జరపాలనే ఆనందంలో ఉన్న మనం ఆయనకు జన్మనిచ్చిన తండ్రిని అనగా దేవునిని అడిగితే, ఆయనను కన్నవాడు ఖచ్చితంగా ఆ దినం గూర్చి మనకు చెప్పక ఆయన వద్ద ఉన్న వాక్యమైయున్న యేసుతో చెప్పిన విషయాన్ని క్రీ॥పూ॥ 1000 సం॥రాల క్రితం అదే దావీదు ద్వారా "నీవు నా కుమారుడవు నేడు నేను నిన్ను

కనియున్నాను" (కీర్తన 2:7) అని పలికించాడు. దేవుడు చెప్పిన ఈ నేడు అనేదినాన్ని కనుగోవాలంటే నరుని మస్తిష్కం బ్రద్ధలై, నరాలు నలిగి, పగిలిపోతాయి గనుక, దేవునికి ఈ లోకం పుట్టకముందే పరలోకంలో పుట్టిన క్రీస్తు మరలా నరుని గర్భము నుండి ఈ మానవ ఆకారానికి రావడానికి వీలు లేదు (మనిషి ఒకేసారి పుడతాడు, పుట్టాలి) గనుక పరిశుద్ధాత్మ సహాయంతో కన్యక గర్భవతి అయితే ఆ కుమారుడు మనలాంటి మట్టి శరీరాన్ని ధరించుకొని మనుష్య కుమారుడుగా అనగా మనిషిగా మన మధ్యకొచ్చాడని యెహాను ద్వారా వ్రాయించినవాడు దేవుడే. (యోహాను 1:1-14). ఈ సృష్టిని దేవుడు క్రీస్తుద్వారా కలుగజేసిన తేది తెలిసినా కూడా క్రీస్తు పుట్టిన తేదిని తెలుసుకోలేము అని గ్రహించినవారు ధన్యులు.

అందుకే ప్రవక్తయైన మికా యేసు జన్మను గూర్చి పుట్టుకగా కాక లోకంలోనికి వస్తాడు అనగా రాకడ మాత్రమే అని వ్రాశాడు. "బెత్లేహేము ఎఫ్రాతా, యూదావారి కుటుంబములలో స్వల్ప గ్రామమైనను నాకొరకు ఇశ్రాయేలీయులను ఏలబోవువాడు **నీలో నుండి వచ్చును.** పురాతన కాలము మొదలుకొని శాశ్వత కాలము ఆయన ప్రత్యక్షమగుచుండెను." (మీకా 5:2, క్రీ॥పూ॥ 600 సం॥) ఇది తెలిసిన లూకా గారు తన సువార్తలో యేసు పశువుల పాకలో పుట్టెను అని వ్రాయక ఒక పశువుల తొట్టిలో పరుండబెట్టియుండుట మీరు చూచెదరు అని చెప్పాడు. ఒకవేళ జన్మస్థలం గూర్చి చెప్పితే అక్కడ ఎంత వద్దన్నా ఖచ్చితంగా గుడికట్టే రకం ఈ మనుషులు అని ముందే తెలిసిన దేవుడు క్రీస్తు భూమిలోని జన్మస్థలం కూడా మరుగుచేశాడని ఆలోచిస్తే అమోఘం (లూకా 2:1-7) ఇక యేసుక్రీస్తునే అడుగుదాం ప్రభువా నీవెప్పుడు పుట్టావో అర్జంటుగా చెప్పు మాకవతల టైమ్ అయిపోతుంది పండక్కి అంటే ఆయన కూడా తను ఎప్పుడు పుట్టాడో, ఎక్కడ పుట్టాడో ఇప్పటికీ చెబుతున్నాడు జాగ్రత్తగా బైబిల్ ద్వారా సరిచూసుకుందాం. జ్ఞానం ఘోషిస్తుంది అని అనగా దేవుని శక్తి, జ్ఞానం అయిన యేసుక్రీస్తు (1కొరింథీ 1:24) మాట్లాడుచున్నాడు అని అర్థం చేసుకోవాలి.

" పూర్వకాలమందు... <u>నేలమట్టిని రవంతయు సృష్టింపక మునుపు నేను పుట్టితిని."</u> (సామెతలు 8:22-36, క్రీ॥పూ॥ 1000 సం॥రాలు) "యేసు, అబ్రహాము పుట్టక మునుపే **నేను ఉన్నాను...**" (యోహాను 8:58, క్రీ॥శ॥ 28).

"యేసు, నేను పరలోకము నుండి (ఈ భూలోకమునకు) దిగి వచ్చితిని..." (యోహాను 6:32, 59, 3:13). "నశించిన దానిని వెదకి రక్షించుటకే మనుష్యకుమారుడు **వచ్చెను.**" (లూకా 19:10)

**“నేను మరలా వచ్చి** మిమ్మల్ని పరలోకంలోని తండ్రి వద్దకు తీసుకువెళ్తాను” (యోహాను 14:1-3, హెబ్రీ 9:28, ప్రకటన 20:7,12)

యేసుప్రభువే స్వయంగా చెప్పిన దానిని బట్టి ఆలోచిస్తే ఆయన ఈ భూమి పుట్టక ముందే పరలోకంలో పుట్టినట్లుగా అర్థమగుచున్నది. విశ్వాసులకు, తండ్రియైన అబ్రహాము (క్రీ॥పూ॥ 2500 సం॥లు) పుట్టక, మునుపే యేసు ఉన్నాడు. గనుకనే ఈ లోకానికి వచ్చాను అన్నాడు తప్ప పుట్టాను అనలేదు. ఆయన పుట్టినపుడు ఈ లోకమే లేనపుడు, డిసెంబరు నెల 25వ తేది క్రీ॥పూ॥ 4సం॥(4బి.సి.) అనియు, మరోక నెల సంవత్సరం అనే వాటిని ఊహిస్తేనే మన మతిమాడి మసై పోవాలి. అదియు గాక ఇలా జన్మదినం గూర్చి మాత్రమే చెబితే పరిశుద్ధాత్మకు వ్యతిరేకమని గుర్తుంచుకోవాలి. ఎందుకంటే బైబిల్‌లో లేని దానికి కలిపి చెరుపుతున్నారు గనుక ఇది క్రీస్తు మొదటి రాకడ మాత్రమే ఈ సత్యం తెలిసినా ఇది భూమిపైకి క్రీస్తు మొదటి రాకడ అని చెప్పే ధైర్యం లేక అసత్యం నుండి బయటకు రాలేక ఈ సత్యాన్ని ప్రకటించేవారినే సిలువ వేసే దశలోనికి వెళ్ళింది నేటి క్రైస్తవ్యం.

సమస్త మానవుల రక్షణ కోసం జగత్తు పునాధి వేయబడక మునుపే పరలోకంలో దేవుని వాక్కుగా పుట్టి, దేవుని సంకల్పనుసారంగా, శరీరధారియై ఈ లోకానికొచ్చి సిలువలో మరణించి తిరిగి లేచిన క్రీస్తును ప్రకటించి అందరిని పరలోకం చేర్చాలనే క్రీస్తు శిష్యుల బోధలను చూసి మనం ఇంకా ఆనందంలో తేలియాడుతూ, నిజమైన - బలమైన విశ్వాసంతో మందడుగు వేసి మసక వెలుతురులో మునిగిన క్రైస్తవ్యానికి క్రీస్తు అసలైన వెలుగును ప్రాకాశింపజేసే నిజమైన జ్యోతులము (నక్షత్రాలం) అవుదాం. ఆనాడు లోక జ్ఞానులైన ఆనామకులకు సృష్టిలోని నక్షత్రం ఆయన యొద్దకు దారి చూపితే, నేడు కాగితపు నక్షత్రాన్ని మన ఇంటిమీద పెట్టుకొని కరెంటుతో వెలిగిస్తూ మరిసిపోక మనమే జీవముగల జ్యోతులమై ఈ గ్రుడ్డిలోకానికి వెలుగైన క్రీస్తును చూపుదాం. (ఫిలిప్పీ 2:14-16, దానియేలు 12:3).

“ఆయన (క్రీస్తు) అదృశ్య దేవుని స్వరూపియై సర్వసృష్టికి **ఆది సంభూతుడై** ఉన్నాడు” (కొలస్సీ 1:15-17)“ కలిగియున్నదేదియు ఆయన లేకుండా కలుగలేదు.” (యోహాను 1:2,3)

“పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకానికి **“వచ్చెను”** అను వాక్యమును నమ్మదగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్యమునై ఉన్నది.” (1 తిమోతి 1:15, 3:16) “ ఆయన ఈ లోకమందు **ప్రవేశించునపుడు**..” (హెబ్రీ 10:5).

“కడవరి కాలములయందు ఆయన **ప్రత్యక్షమాయెను**...” (1పేతురు 1:21).

పై వాక్యాలను బట్టి దేవుని నీతితో చాలా జాగ్రత్తగా ఆలోచిస్తే ఈ లోకాన్నే కలుగజేసిన యేసుక్రీస్తు ప్రభువు ఈ లోకంలో కేవలం 2000 సం॥రాల క్రితం పుట్టాడనటం వెర్రితనం లేదా హాస్యాస్పదమే అవుతుంది. ఎందుకంటే ఇల్లు కట్టినవాడు ఇంట్లో పుట్టడు గదా! కేవలం గృహప్రవేశం చేస్తాడు గనుక, పరలోకంలో పుట్టి, ఈ లోకాన్ని పుట్టించి సమస్తానికి అనగా ఈ లోకంలో పుట్టిన దేవుళ్ళు, దేవతలు, మనుషులందరికి ప్రభువైన క్రీస్తు, అందరిని పాపవిముక్తి చేయడానికి మొదటిసారి దివి నుండి భువికి దిగివచ్చాడు. అంతేగాని నిన్న మొన్న పుట్టిన బచ్చాగాడు కాదు. అందరికన్నా (జేష్టుడు) పెద్దోడు. అంతేగాని నిన్న మొన్న ఈ భూమిలో కూడా పుట్టిన వాడుకాదు. అందుకే యేసు క్రీస్తు ప్రభువు దేవుని ప్రియ కుమారుడని నమ్మి ఆయన చూపిన మార్గంలో నడిచి రక్షింపబడ్డ వారిని తిరిగి దేవునికి అప్పగించడానికి రెండవ సారి కూడా రానైయున్నాడు. “ఆయన జన్మదినం కన్నా మరణ దినమే మేలు” అని తన పితరుడు, రాజైన సొలోమోను ద్వారా సుమారు వేయిసం॥లు క్రితమే దేవుడు వ్రాయించాడు. కాబట్టే క్రీస్తు మొదటి రాకడ సందర్భంగానైనా మా సంతోషం కోసం ఈ క్రిస్మస్ పండుగ జేస్తున్నామనే వారిని దేవుడు జ్ఞాపకమము చేసుకొనే అవకాశం కనుచూపుమేరలో లేదు కానీ ఈ లోకానికొచ్చిన దేవుని కుమారుడైన యేసుక్రీస్తు మన హృదయంలోనికి మరియు పొరుగు వారి హృదయంలోనికి ప్రవేశించినప్పుడే మనం ఏ పండుగనైనా చేసుకోవడానికి అర్హులం. ఆరోజే ప్రతి మనిషికి నిజమైన క్రిస్మస్.


ఇవి కేవలం పుట్టినరోజు అనుకొని చేసే సంబరాలే గనుక పుట్టిన రోజు సీక్రెట్ కాబట్టి వాటిని ఏ రోజైనా జరుపుకోవచ్చు అందుకేనేమో కొందరు నెలంతా, మరికొందరు 3 నెలలు, ఇంకొందరు సంవత్సరమంతా జరుపుకొంటున్నారు. అయితే ఇది మన సంతోషం కోసమే కాని దీని వలన దేవునికి ఒరిగేదేమిలేదు గనుక ప్రతి రోజు క్రీస్తు నందు ఆనందిస్తూ పండుగజేసుకోండి (ఫిలిప్పీ 4:4, సామెతలు 15:15). క్రీస్తు జన్మదినం ద్వారా గాక మరణదినం ద్వారా ఎక్కువ సంతోషపడి సంబరం (కీర్తన 118:22-24) చేసుకొంటూ సువార్తను ప్రకటించే వారినే దేవుడు ఆశీర్వదించి అనగా హ్యాపీ క్రిస్మస్ అని అనేవారికి కాక కనీసం హ్యాపీ (మరణదినం) గుడ్‌ఫ్రైడే అనే వారిని దీవిస్తాడని మరచిపోక, ఏ పండుగను (మరణదినమా? జన్మదినమా?) ఘనంగా చేసి, దేవునిని మరియు క్రీస్తును ఘనపరుస్తారో మీకే వదలి వేస్తున్నాను. అప్పుడు దావీదు యెహోవా ఏర్పాటు చేసిన దినమైన క్రీస్తు మరణ దినాన సంతోషించండి అన్నాడు, ఇప్పుడైతే సిలువ వేయబడిన క్రీస్తు బోధలో అన్ని దినాలను మరచిపోమన్నాడు గనుక మరణ దినం కూడా జ్ఞాపకం చేసుకోవడం కాదు కాని ఆయన మనకోసం మరణించినది

ప్రతిరోజు జ్ఞాపకం చేసుకొని ప్రతిక్షణం సంతోషిద్దాం. ఇది మొదలుకొని క్రీస్తు రెండవ రాకడ వరకు లేదా మన ప్రాణం పోకడ వరకైనా మన ఆత్మతో పాటు అనేకుల ఆత్మల రక్షణార్థమై కష్టపడుదాం. క్రీస్తు నేడు పుట్టెను హల్లేలూయా అని కాక, కనీసం క్రీస్తు నాడు పుట్టెను అని అయినా ప్రకటించి క్రీస్తునకు, మనకు తండ్రియైన దేవున్ని మహిమ పరుద్ధాం. క్రీస్తు జన్మదినమే కాదు మానవులందరి జన్మదినం కూడా రహస్యం అని తెలిస్తే మరింత ఆశ్చర్యపోతారు.

అందరికి తండ్రియైన సర్వేశ్వరుడు, సర్వోన్నతుడైన దేవుడు మనలందరిని తన ఆత్మచేత ముద్రించి, తన వాక్యపు వెలుగులో మనం నడుచుచుండగా తన ప్రియ కుమారుడై క్రీస్తు రాజ్యంలో నిలిపి, మన లోకాన్ని తిరిగి స్వతంత్రించుకొనే భాగ్యాన్ని కలుగజేయును గాక... ఆమేన్...

దేవుని జ్ఞానముతోను ఆత్మ సహాయంతోను వ్రాసిన కరపత్రాలు, పుస్తకాలు, ఆడియో, విడియోలు కావాలనుకొనేవారు ఈ క్రింద ఇవ్వబడిన చిరునామాలలో ఎల్లవేళలా సంప్రదించండి.

సిలువ వేయబడిన క్రీస్తు బోధలో
మీ ఆత్మీయ సోదరుడు
**డా॥ బొంకూరి జాన్**
వ్యవస్థాపక డైరెక్టర్ & వాక్యోపదేశకులు




మేము దేవుని కుమారుడు, దేవుని శక్తి, జ్ఞానమైన సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము. 1 కొరింథి 1:22-24


**INSTITUTE OF BIBLE TECHNOLOGY - HYD**
**" TEMPLES OF GOD" CHURCH**
**(CHRIST THE SON OF GOD MINISTRIES)**
**దేవుని మహాజ్ఞాన సాంకేతిక విధ్యాలయం – దేవాలయాల సంఘం**

HAL రాఘవేంద్రకాలని, Indian Oil పెట్రోల్‌బంక్ వెనుక, సుచిత్ర X రోడ్ పోస్టు,
కుత్బుల్లాపూర్, హైదరాబాద్ - 500 067. ఫోన్ : 040 - 20000700, సెల్ : +91 9440142887.

**www.bibletechnology.net.,**

E-mail : johnbonkuri59@gmail.com; bibletechnology@gmail.com


ఉచిత కరపత్రాలు, బైబిల్ ట్రైనింగ్, పుస్తకములు, ఆడియో & వీడియో సి.డి.ల కొరకు సంప్రదించండి.


బ్రదర్ జె. రవి (అడ్మినిస్ట్రేట్ మరియు కరస్పాండెంట్) నెం. 7-1-38/1/33, బాబు జగ్గజ్జీవనరామ్ నగర్, అమీర్‌పేట,
హైదరాబాద్ - 500016, ఫోన్ : 9440 792 192, 9676 744 233, 9700 600 270,
9948 338 410, 9701 658 187, 9912894005, 8106299985, 9912051394


IBT/2017

For Distribution in Churches only

"కులం-కుళ్ళు" "మత్తం-మత్తు" "ధనం-దగా""మనిషి-మాయ""దేవుడే-దిక్కు" సత్యమేవ జయతే!

krupasannidhi Graphics HYD.Cell:9396965131